క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి



కళాశాలలో వసతులను వివరిస్తున్న అధ్యాపకుడు

కళ్యాణదుర్గం: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు డిగ్రీ కళాశాలలో చేరాలని అధ్యాపకులు ఎం.సుధాకర్, డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర జయరామి రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో చేరే విషయంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్ ఫిజిక్స్ ల్యాబ్ తో పాటు అన్ని విభాగాలూ అనుకూలంగా ఉన్నాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మఘట్ట: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిభా పూలే సంక్షేమ గురుకుల విద్యాలయంలో 2023–24కు సంబంధించి ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు ఈ నెల 5 నుంచి ఏప్రిల్ 4లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం పాఠశాలలో సంప్రదించాలన్నారు.

హెడ్ కానిస్టేబుల్ దాతృత్వం

ఉరవకొండ: పాల్తూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గురికాల శివప్రసాద్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆశ, అనుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు నిర్వహించనున్నట్లు ఎంపీపీ యు.పద్మ, ఎంపీడీఓ షకీలాబేగం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని శాఖలకు సంబంధించి సంక్షేమం, అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన

రాయదుర్గం రూరల్: మండలంలోని రాయంపల్లి, కదరంపల్లి గ్రామాల్లో 2020లో వేసిన సిమెంట్ రోడ్ల నాణ్యతను మంగళవారం క్వాలిటీ కంట్రోల్ డీఈ రాజేశ్వర్‌రెడ్డి, జేఈ తిరుమల రెడ్డి పరిశీలించారు. రాయంపల్లిలో రూ.7 లక్షలు, కదరంపల్లిలో రూ.3 లక్షల ఎస్ఆర్ఈజీఎస్, పంచాయతీ రాజ్ నిధులతో సీసీ రోడ్లు వేసినట్లు పంచాయితీ రాజ్ జేఈ మునిస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యంతో పాటు నిందితులను చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఇంటలిజెన్స్ అధికారులు, సెబ్ పోలీసులు పట్టుకున్నారు. ఇంటలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ నరసానాయుడుకు అందిన సమాచారం మేరకు మంగళవారం స్పెషల్ టీం ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, కళ్యాణదుర్గం సెబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌దాస్ పట్టణ సమీపంలోని రింగ్‌రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ కారులో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్నట్టు గుర్తించారు. 90 ఎం.ఎల్. సామర్థ్యం ఉన్న హైవార్డ్స్ విస్కీ 1920 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న బెళుగుప్ప మండలం కోనంపల్లికి చెందిన జి.శ్రీధర్, కళ్యాణదుర్గం మండలం మానిరేవుకు చెందిన కారు డ్రైవర్ మాదిగ సుంకన్నను అదుపులోకి తీసుకున్నారు. కారును సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలి

- ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోండి
- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపీ తలారి రంగయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు

ఉరవకొండ: త్వరలో జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక దేవాంగ ఫంక్షన్ హాల్‌లో ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం ఎలాంటి ప్రణాళికతో ముందుకు వెళ్లాలో అన్న అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి మంత్రితో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపీ తలారి రంగయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసులు, ఎంఆర్‌సీ రెడ్డి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రకటించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఉపాధ్యాయులు, పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. టీడీపీ, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లతో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఎంపీ మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటుతో రవీంద్రారెడ్డి, రామచంద్రరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నికలకు సమయం తక్కువగా ఉందని, ప్రతి ఒక్కరూ కష్టపడి పార్టీ ప్రకటించిన అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేద్దామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసే సమయంలో రోమన్ అంకె కాకుండా 1 అని సూచించాలన్నారు. కేవలం మొదటి ప్రాధాన్యత ఓటు మన పార్టీ ప్రకటించిన అభ్యర్థులకు గుర్తించి, మిగతా ప్రాధాన్యత ఓటు వేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్లు, బెళుగుప్ప, కూడేరు మండలాలల ఎంపీపీలు చంద్రమ్మ, పుష్పావతి, పెద్దన్న, నారాయణరెడ్డి, జెడ్పీటీసీలు ఏసీ పార్వతమ్మ, హనమంతు, వైస్ ఎంపీపీ నరసింహులు, పార్టీ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబులేసు, సర్పంచ్‌లు లలితమ్మ, మోనాలిసా, పార్టీ నాయకులు అశోక్, తోజోనాథ్, ఆసీఫ్, సింగాడి తిప్పయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, బసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై నేడు సమావేశం

కళ్యాణదుర్గం: పట్టణంలోని మంత్రి ఉషాశ్రీ చరణ్ క్యాంపు కార్యాలయంలో మంత్రి అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికలపై బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం, శెట్టూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం, కంబదూరు మండలాల్లోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, పార్టీ మండల కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, ముఖ్యనాయకులు హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

పింఛన్ల పంపిణీలో గృహసారథులు పాల్గొనాలి

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా వలంటీర్ల ద్వారా చేపడుతున్న సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు తప్పక పాల్గొనాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని గుర్తుచేశారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల్లాగా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వ్యవహరించబోరని స్పష్టం చేశారు. కేవలం పర్యవేక్షణ మాత్రమే ఉంటుందన్నారు. ప్రతి పింఛన్ పారదర్శకంగా అందజేస్తామని ఇందులో ఎవరి ప్రమేయం ఉండబోదని వివరించారు. టీడీపీ నాయకులు దీన్ని వక్రీకరించి మాట్లాడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అందరూ భాగస్వాములై పింఛన్ల పంపిణీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు పింఛన్ల పంపిణీ

కూడేరు: ప్రభుత్వం అందించే సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని అన్ని పంచాయతీల్లో చేపట్టనున్నట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా మంగళవారం తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని వర్గాల పింఛన్ లబ్ధిదారులు 5,564 మంది ఉండగా రూ.1,53,23,250 మంజూరైందన్నారు. నగదును పంచాయతీ కార్యదర్శులకు అందజేశామని, లబ్ధిదారులు అందుబాటులో ఉండి పింఛన్ నగదు పొందాలని ఆయన సూచించారు.

అక్రమాలకు పాల్పడితే డీలర్లపై చర్యలు

కూడేరు: రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే డీలర్లపై చర్యలు తప్పవని సీఎస్‌డీటీ లక్ష్మీదేవి హెచ్చరించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని చౌక ధాన్యపు డిపో డీలర్లతో రేషన్ సరుకుల పంపిణీపై ఆమె సమీక్షించారు. అందుబాటులో ఉండి కేటాయింపు మేరకు కార్డుదారులందరికీ సరుకులు సక్రమంగా అందజేయాలన్నారు. ఉచితంగా అందించే బియ్యాన్ని పక్కాగా పంపిణీ చేయాలన్నారు. కార్డుదారుల నుంచి ఫిర్యాలు రాకూడదన్నారు. ఎండీయూ ద్వారా ఇంటి వద్దకే వెళ్లి సరుకుల పంపిణీ జరగాలన్నారు.

సుందరీకరణ పనులు భేష్

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ పంచాయతీ సుందరీకరణలో భాగంగా చేస్తున్న అభివృద్ధి పనులు బాగున్నాయని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. పట్టణంలో సీసీ రోడ్లతో పాటు డివైడర్ల మీద ఉన్న వివిధ రకాల పూల మొక్కలు, హైమాస్ దీపాలను మంత్రి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లలితమ్మతో పాటు పాలకవర్గ సభ్యులను మంత్రి అభినందించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కృషితో పట్టణం అభివృద్ధి పథకంలో దూసుకుపోతుందన్నారు.

వైద్యుడికి సన్మానం

శెట్టూరు: మండల కేంద్రంలోని 104 వాహనంలో వైద్య సేవలు అందజేస్తూ బదిలీ అయిన డాక్టర్ రోహిన్‌ను వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్లు వేణుకార్తికేయ, తరుణసాయి, సీహెచ్‌ఓ శోభలత, సూపర్‌వైజర్లు లీలవతి, సుమతి, హెల్త్ అసిస్టెంట్లు జాన్సన్, హనుమంతరాయుడు, పవన్‌కుమార్, స్టాఫ్ నర్స్ అంజలి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో పశుగణాభివృద్ధి



రైతులకు యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న వైద్యాధికారులు

బెళుగుప్ప: పాడిపశువులు ఎదకు వచ్చిన సమయాల్లో పశువైద్యశాలల్లో కృత్రిమ గర్భధారణ చేయించడం మూలంగా ఆడదూడలు ఎక్కువగా పుట్టి మరింత పశుగణాభివృద్ధి సాధ్యమని కళ్యాణదుర్గం పశువైద్యశాల సంచాలకుడు శ్రీనివాసగుప్తా, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి సుధాకర్ సూచించారు. మండలంలోని వెంకటాద్రిపల్లిలో మంగళవారం జాతీయ పశు కృత్రిమ గర్భధారణ, లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని పశు వైద్యాధికారి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా 95 శాతం పెయ్యి (ఆడ) దూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. అనంతరం లేగదూడల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించి దూడల పోషణకు కాల్షియం టానిక్, నట్టల నివారణ మందులు ఉచితంగా అందించారు. ఉత్తమంగా ఉన్న లేగదూడల యజమానులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. అనంతరం మండల వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలో మార్చి 1 నుంచి 31 వరకూ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వైద్యాధికారి వినోద్‌కుమార్, పశువైద్య సిబ్బంది మారుతి, వంశీ, తిమ్మరాజు, సాయి, రవితేజ, గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టైలర్ల దినోత్సవం

కళ్యాణదుర్గం: ప్రపంచ టైలర్ల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టైలరింగ్ సెంటర్‌లో నిర్వాహకులు నిత్యశ్రీ, టైలర్లు లక్ష్మి, స్వప్న, ప్రవల్లిక, నాగమణి, పద్మ, శిల్ప, పుష్ప, రాధ, జయలక్ష్మి కేక్ కట్ చేశారు. టైలర్లకు 'జగనన్న చేదోడు' ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 10 వేలు అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు.

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం టైలర్ల సంక్షేమానికి పాటుపడుతోందని ఉరవకొండ టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు జంగ్లీ నగేష్ తెలిపారు. మంగళవారం స్థానిక క్లాక్‌టవర్ సమీపంలో పెద్దకోట్ల కాంప్లెక్స్‌లో టైలర్స్‌డే సందర్భంగా కేక్ కట్ చేసి టైలర్స్ యూనియన్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతివృత్తుల వారికి ఏటా రూ.10 వేలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శిలార్‌మగ్బూల్, కృష్ణమూర్తి, రాము, రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

కణేకల్లు: కణేకల్లులో మంగళవారం టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కేక్ కట్ చేవారు. అందరు ఐక్యమత్యంగా మెలిగి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం కణేకల్లు మండల టైలర్ అసోషియేషన్‌ను వారంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలు తెలుసుకోండి



డీఎంహెచ్‌ఓ వీరబ్బాయికి సమస్యలు వివరిస్తున్న సర్పంచ్ సురేంద్ర, సచివాలయ కన్వీనర్ పార్వతి

వజ్రకరూరు: వైద్యుల పనితీరుపై గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ఫిర్యాదుదారులను కలిసి వాస్తవాలు తెలుసుకోవాలని గడేహోతూరు సర్పంచు కె. సురేంద్ర, గ్రామ సచివాలయ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి కె.పార్వతి తదితరులు డీఎం అండ్‌హెచ్‌ఓ వీరబ్బాయిని కోరారు. గడేహోతూరు గ్రామంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల పనితీరుపై ఇటీవల పలు పత్రికల్లో కథనాలు రావడంతో డీఎంహెచ్‌ఓ మంగళవారం విచారణ చేపట్టారు. సర్పంచు, సచివాలయ కన్వీనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల గడేహోతూరు ప్రభుత్వాస్పత్రి ని 24 గంటల ఆస్పత్రిగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ ఉత్తర్వుల మేరకు వైద్యులు ఆసపత్రిలో 24 గంటలూ ప్రజలకు అందుబాటు లో ఉండేలా తగుచర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను కోరారు. వైద్యుల పనితీరుపై గ్రామంలో విచారణ చేపట్టాలన్నారు. అప్పటికే పక్కా ప్రణాళికతో అక్కడకు చేరుకున్న కొందరు తెలుగుదేశం నాయకులు విచారణ పక్కదారి పట్టేలా సర్పంచు, స చివాలయ కన్వీనర్ తదితరులతో వాదనకు దిగారు. వైద్యుల పనితీరు బాగుందని, 24 గంటల వైద్యసేవలు మాకొద్దని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ మాత్రమే వైద్యులు వై ద్యసేవలు అందిస్తే చాలంటూ తెలుగు దేశం నాయకులు వితండ వాదనకు దిగారు. దీంతో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ చేపట్టకుండానే డీఎంహెచ్‌ఓ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనుపమ, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయ్‌కుమార్, దేవేంద్ర, సుభాష్, ప్రసాద్‌రెడ్డి, వైద్యులు పద్మ, మారుతి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి షటిల్ టోర్నీ ప్రారంభం



టోర్నీ ప్రారంభిస్తున్న గవిమఠం పీఠాధిపతులు

ఉరవకొండ: స్థానిక ఎస్‌కేఆర్‌సీ క్లబ్‌లో గవిమఠం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం క్లబ్ పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి షటిల్ టోర్నీని గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు రేగాటి నాగరాజు, కార్యదర్శి శివప్ప, సహాయ కార్యదర్శి ఇర్షాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మద్దానేశ్వరస్వామి ముత్యాలపల్లకీ ఉత్సవం

రాయదుర్గం రూరల్: 74 ఉడేగోళంలో మద్దానేశ్వర స్వామి రథోత్సవ ముగింపు సందర్భంగా బుధవారం సాయంత్రం 6.30 గంటలకు ముత్యాల పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు బసవరాజు మంగళవారం తెలిపారు. 7.30 గంటలకు లంకాదహనంతో రథోత్సవం, పశువుల జాతర ముగియనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు పల్లకీ ఉత్సవంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మంగళవారం మద్దానేశ్వర స్వామికి విశేషపూజలు నిర్వహించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

బొమ్మనహాళ్: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. మార్చి 1 నుంచి 31వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో తిరిగి టీకాలు వేస్తామన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

కళ్యాణదుర్గం: మండలంలోని చాపిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఓటు హక్కు కలిగిన సభ్యులు ఈ-కేవైసీ చేసుకోవాలని త్రిసభ్య కమిటీ సభ్యులు సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఓటర్లు ఈ-కేవైసీ కోసం ఆధార్, రేషన్ కార్డు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ పాసుపుస్తకం, రెండు పాస్ ఫోటోలు ఇవ్వాలన్నారు. సంఘంలో పంట రుణం తీసుకున్న రైతులు మార్చి 15 లోపు వడ్డీ కట్టి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు వెంకటేశులు, శివలింగా రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం



శెట్టూరు: కేజీబీవీ పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

కళ్యాణదుర్గం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డి చంద్రశేఖర్ , జీఎల్ ఎన్ ప్రసాద్, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుందుర్పి: స్థానిక ఉన్నత పాఠశాలలో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు బీసీ తిమ్మప్ప, పురుషోత్తం, తిరుపాల్, రాధాకృష్ణ, భ్రమరాంబ, విద్యార్థులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నేషల్ సైన్స్ డేను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఓ లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అధ్యక్షతన సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ శాస్త్ర విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు జగదీష్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈశ్వరయ్య, సైన్స్ ఉపాధ్యాయులు యోగేంద్రనాథ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండల పరిధిలోని కరుట్లపల్లి, పి.నారాయణపురంలోని హైస్కూల్, ప్రైమరీ స్కూళ్లలో మంగళవారం సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శనకు ఉంచిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు శేషాచలం, రమణప్రసాద్ బహుమతులు అందజేశారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్

కణేకల్లు: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్ ఆదేశించారు. కణేకల్లులోని జెడ్పీబాలుర హైస్కూల్, బాలికల హైస్కూల్, ఉర్దూ హైస్కూల్, మోడల్ స్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, 'నాడు–నేడు' పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అనంత సంకల్పం వంద రోజుల కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. సిలబస్ మరో మారు రివిజన్ చేస్తూ రోజుకో సబ్జెక్ట్‌పై ప్రత్యేక బోధన నిర్వహించి మరుసటి రోజు పరీక్ష పెట్టాలన్నారు. సీ గ్రేడ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులందరూ చిత్తశుద్ధితో పనిచేసి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నరసింహులు, ఆదినారాయణ, మల్లిఖార్జున, రహముతుల్లా తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: ప్రతి విద్యార్థీ పట్టుదలతో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కేఏపీ కోఆర్డినేటర్ ఎర్రిస్వామి సూచించారు. మంగళవారం మండలంలోని ఎస్.కోనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేఏపీ ఆధ్వర్యంలో పబ్లిక్ పరీక్షలు రాసే విధానంపై పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గత సంవత్సరం 'పది'లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.